క్లుప్తంగా

నన్నయ స్పోర్ట్స్ సభ్యుడిగా రవీంద్రనాథ్



రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రసన్న

దేవరపల్లి: రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సభ్యుడిగా దేవరపల్లి మండలం రామన్నపాలెం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన విశ్వవిద్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వైస్ చాన్స్‌లర్ ప్రసన్న, ఆచార్యులు, బోర్డు సభ్యులు ఆయనను అభినందించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నన్నయ యూనివర్శిటీ పరిధిలో జరిగే క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. క్రీడల్లో అనేక మార్పులు తీసుకు రావలసి ఉందని, దీనిని బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను తయారు చేసి ఒలింపిక్స్‌కు పంపిస్తానన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నిక



మండల నూతన కార్యవర్గ సభ్యులు

నిడదవోలు రూరల్: మండల సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని సమిశ్రగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఏపీవీడబ్ల్యూఎస్ఈ జిల్లా జేఏసీ నాయకులు కె.సుభాకర్, ఎం.సత్తిరాజు ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా సీహెచ్ ధర్మతేజ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జి.ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా కె.రోజారాణి, బి.రవికిషోర్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ భాను ప్రకాష్, సంయుక్త కార్యదర్శులుగా బి.డానిజోషఫ్, జి.రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సూరిబాబు, కోశాధికారిగా జి.సునీత, సభ్యులుగా వి.నగేష్, సయ్యద్ బాజీ, కె.రమేష్, ఎండీ ఆరీఫ్, కె.గోవర్ధన్, వి.సాయిబాబులు ఎన్నికైయ్యారు.

తాటాకిల్లు దగ్ధం



అగ్ని ప్రమాదానికి గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నల్లజర్ల: దూబచర్ల రావిచెట్టు సెంటర్‌లో మంగళవారం మధ్యాహ్నం రైతు కంచర్ల చిననాగుకు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. కుటుంబ సభ్యులంతా పొలం పనులకు వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టుగా భావిస్తున్నారు. ప్రమాద విషయం తెలియగానే భీమడోలు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇల్లు కట్టుకోవడానికి రూ.7 లక్షలు తెచ్చారని అందులో ఒక లక్ష ఖర్చు కాగా మిగిలిన రూ.6 లక్షలు, 4 కాసుల బంగారు ఆభరణాలు అగ్నికి ఆహుతి అయినట్టు బాధితుడు చిననాగు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మొండిగోడలకే పరిమితం

- ఏడేళ్లుగా పూర్తి కాని సమాఖ్య భవనాలు
- కొవ్వూరు డివిజన్‌లో 137 నిర్మాణాలు
- ఒక్కొక్క భవనానికి రూ.12 లక్షల మంజూరు



దేవరపల్లిలో అసంపూర్తిగా ఉన్న మహిళా సమాఖ్య భవనం

దేవరపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్ర మహిళలు సభలు, సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి 2016–17 సంవత్సరంలో ప్రతి గ్రామానికి ఒక మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నిధులు కొరత కారణంగా భవన భవన నిర్మాణాలు నత్తనడకన జరిగాయి. ఒక ప్రక్క నిధుల కొరత, మరొక పక్క కాంట్రాక్టర్ల జాప్యం వంటి కారణాలతో భవన నిర్మాణాలకు ఆటకం ఏర్పడింది. ఇంతలో 2019 సాధారణ ఎన్నికలకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో భవన నిర్మాణాలు ఎక్కడకక్కడ నిలిచిపోయాయి. అప్పటి నుంచి భవనాలు వివిధ దశలో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లో సొంత భవనాలు లేక మహిళా సమాఖ్య సంఘాలు సమావేశాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా నిలిచిపోయిన భవనాల గురించి పట్టించుకోలేదని డ్వాక్రా మహిళలు వాపోతున్నారు.

డివిజన్‌లో 137 భవనాలకు శ్రీకారం

కొవ్వూరు డివిజన్‌లోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లోని తొమ్మిది మండలాల్లో 137 భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. స్త్రీ శక్తి నిధులు, ఉపాధి హామీ నిధుల మ్యాచింగ్‌తో ఒక్కొక్క భవనానికి సుమారు రూ. 12 నుంచి 40 లక్షలు మంజూరు చేశారు. వీటిలో 24 భవనాల నిర్మాణం పూర్తిగా కాగా, 113 భవనాలు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి.

మొండిగోడలతో వెక్కిరింపు

గ్రామాల్లో మొండిగోడలతో భవనలు మహిళా సమాఖ్యలను వెక్కిరిస్తున్నాయి. మొండి గోడలను చూచి మహిళలు నిరుత్సాహం చెందుతున్నారు. మూడు నియోజకవర్గాల్లో 5186 డ్వాక్రా గ్రూపులుండగా, 51,950 మంది సభ్యులు ఉన్నారు. దేవరపల్లి మండలంలో 15 భవనాలకు గాను 13 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. బందపురం, లక్ష్మీపురం గ్రామాల్లో భవనాల నిర్మాణం పూర్తి కాగా, బంధపురం భవనంలో రైతు సేవా కేంద్రం నిర్వహిస్తున్నారు. దీనితో మహిళా సమాఖ్య సమావేశాలకు ఇబ్బందిగా ఉందని మహిళలు వాపోతున్నారు. గోపాలపురం మండలంలో 18 భవనాల నిర్మాణం చేపట్టినప్పటికీ ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. నల్లజర్ల మండలంలో 23 మహిళా సమాఖ్యలు ఉండగా, 14 భవనాలు మంజూరయ్యాయి. వీటిలో తొమ్మిది భవనాల నిర్మాణం పూర్తి కాగా, ఐదు భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న భవనాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగి అసాంఘిక కార్యకలపాలకు అడ్డడా మారి శిధిలావస్థకు చేరుకున్నాయి. డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లో భవనాల పరిస్థితి ఇలా ఉన్నాయి.



యర్నగూడెంలో మొండిగోడలతో అసంపూర్తిగా భవన నిర్మాణం

నియోజకవర్గం	సంఘాలు	సభ్యులు	పూర్తయినవి	అసంపూర్తి భవనాలు
నిడదవోలు	5186	51950	1	42
కొవ్వూరు	4549	45627	8	30
గోపాలపురం	5629	56427	15	41

ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి



అసంపూర్తిగా ఉన్న భవనాల వివరాలను ఇటీవల ఉన్నతాధికారులు తీసుకున్నారు. సుమారు ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. భవనాలు పూర్తయితే డ్వాక్రా మహిళలకు ఉపయోగంగా ఉంటాయి. దేవరపల్లి మండలంలో 15 భవనాలకు గాను 13 భవనాలు వివిధ దశలో నిర్మాణాలు ఆగిపోయాయి. గోపాలపురం మండలంలో 18 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాను.

రోజ్ మాణిక్యం,
ఏపీఎం గోపాలపురం, దేవరపల్లి మండలాలు

యోగా జట్టు ఎంపిక పోటీలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

నిడదవోలు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల విద్యార్థులకు స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం యోగా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు ఆరుగురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి, అధ్యాపకులు ఎస్.మూర్తి, బి.రామగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు, ఎం.పద్మజ, యోగా ట్రైనర్ పి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని దూబచర్లలో మంగళవారం సంభవించిన అగ్నిప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన కంచర్ల చిననాగు బాధిత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మీ కుటుంబానికి మేం అండగా ఉంటామని ధైర్యం చెబుతూ అప్పటికప్పుడు తమ జేబుల్లో ఉన్న సొమ్ము రూ.13 వేలు, బియ్యం తక్షణ సాయంగా బాధితుడు కంచర్ల చిననాగుకు అందజేశారు. సాయం అందించిన వారిలో తొమ్మండ్రు రవి, పంది సత్యనారాయణ, సయ్యద్ మునాఫ్, పిట్టా జాన్ సుకుమార్, చేబ్రోలు చిన్నారావు, బాలాజీ, దోవసాయి, నందమూరి రమేష్, మాణికల ధర్మరాజు, తాతినదొరబాబు, మాణికల సాయిబాబా, జెట్టి సత్యనారాయణ, అక్కిన పెద్దిరాజు తదితరులు ఉన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కాకరపర్రు ఉన్నత పాఠశాల క్రీడాకారులు

పెరవలి: మండల స్థాయి ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ చంద్రమూర్తి తెలిపారు. మండలంలోని కాకరపర్రు ఉన్నత పాఠశాలకు చెందిన 25 మంది క్రీడాకారులు డివిజన్ స్థాయి ఆటల పోటీలకు ఎంపికవ్వటంతో వారి అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కోకో, వాలీబాల్, రన్నింగ్, క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడల్లో విశేష ప్రతిభ కనబర్చిన పాఠశాల విద్యార్థులు డివిజన్ స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి గ్రామానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని కోరారు. యంఎస్‌పీపీఎస్ మూర్తి క్రీడాకారులకు క్రీడా దుస్తుల కొనుగోలుకు రూ.10 వేలు అందించారు. పీడీ పుల్లపరాజును అభినందించారు.

సూపర్ సిక్స్.. డూపర్ మోసాలు

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై పోరాటం ఆగదు
- కూటమి పాలనపై మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ధ్వజం



చాగల్లు: చంద్రబాబు చెప్పిన పథకాలు కొన్ని అరకొరగా అందితే.. మరి కొన్ని అమలు చేయకుండా.. సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటూ ప్రచారం చేసుకోవడానికి సిగ్గు లేదా? అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు దుయ్యబట్టారు. మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలు మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలను జూన్ 2024 నుంచి అమలు చేస్తానని మొదటి ఏడాది ఎగ్గొట్టారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు శఠగోపం పెట్టారన్నారు. ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తానని అరకొరగా నిధులు జమ చేశారన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి పథకాల ఊసే లేకుండా మంగళం పాడేశారన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకుండా, రైతులను నష్టాల ఊబిలోకి నెట్టేశారన్నారు. చంద్రబాబు తన అసమర్థతను కప్పి పుచ్చుకునేందుకు ప్రశ్నించే వారిపై పోలీసులను ఉసిగొల్పి అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలు, ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన పథకాలకు పేర్లు మార్చి, అంతా తన గొప్పేనంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను కాలరాస్తున్న కూటమి

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కూటమి ప్రభుత్వం కాల రాస్తోందన్నారు. ప్రభుత్వాలే విద్య, వైద్యం అందించాలని ఆకాంక్షిస్తే ప్రస్తుత కూటమి సర్కారు వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం తగదన్నారు. 17 నెలల కాలంలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేసిన కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణానికి డబ్బులు లేవని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో చంద్రబాబు రూ.కోట్ల విలువ చేసే భూములను ఎకరా వంద రూపాయలకు ప్రైవేట్ పరం చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి నేతలు కల్తీ మద్యం తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారన్నారు. చంద్రబాబు అనుచరులే నకిలీ మద్యం తయారీలో ప్రధాన సూత్రధారులుగా నిలిచారని, వీరి అండదండలు లేకపోతే సీఎం సొంత జిల్లాలో నకిలీ మద్యాన్ని స్వేచ్ఛగా తయారు చేయడం సాధ్యమేనా? అని ఆయన ఆరోపించారు.

వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీ చించివేత



వెంకటాయపాలెంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

గోపాలపురం: మండలంలోని వెంకటాయపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పార్టీ జిల్లా కార్యదర్శి దుగ్గిరాల రమేష్‌బాబు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారు. దీనితో దుగ్గిరాల రమేష్‌బాబు పలువురు కార్యకర్తలతో చించిన ఫ్లెక్సీ వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేసి నిరసన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై పి.మనోహర్ ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడిని తహసీల్దార్ సాయి ప్రసాద్ వద్ద బైండోవర్ చేసి కేసు నమోదు చేశామన్నారు. నిరసన కార్యక్రమంలో గోపాలపురం ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి,ముచ్చికర్ల రవి, కోనాల కిరణ్‌కుమార్ వెంకటాయపాలెం గ్రామ కమిటీ అధ్యక్షుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం పంపిణీ



ప్రకాశరావుపాలెంలో ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

నల్లజర్ల: ప్రకాశరావుపాలెంలో ఇటీవల అగ్నిప్రమాదం సంభవించి ఊర మహంకాళికి చెందిన తాటాకిల్లు దగ్ధమై ఆ కుటుంబం కట్టుబట్టలతో రోడ్డునపడింది. మంగళవారం మానవత సంస్థ బాధిత కుటుంబానికి రూ.5వేల నగదు, నిత్యావసర సరకులు అందజేసింది. మండల మానవత అధ్యక్షుడు పాకలపాటి వెంకటేశ్వరావు, నందం రాజేంద్రప్రసాద్, గుళ్లపూడి వెంకటరత్నం, ప్రత్తిపాటి రాంబాబు, దాసు కనకాచార్యులు, పాతూరి గోపాలం, చిట్రోజు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు. చీపురుగూడెంలో అనారోగ్యంతో బాధపడుతున్న వసంతాడ సంజీవకు రూ.5వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో గుళ్లపూడి వెంకటరత్నం, ప్రత్తిపాటి రాంబాబు, గ్రామపెద్దలు కూసంపూడి వెంకటేశ్వరావు, వసంతాడ అనిల్, ఇజ్రాయిల్, భీమడోలు సుబ్బారావు పాల్గొన్నారు.

కలలు గెలిచిన గురువులు

మండలంలో 13 మందికి ఉద్యోగాలు

దేవరపల్లి: డీఎస్సీ–2025 పరీక్షల్లో ప్రతిభచూపి దేవరపల్లి మండలానికి చెందిన 13 మంది క్రీడాకారులు వ్యాయామ ఉపాధ్యాయులుగా కొలువు దీరారు. వీరంతా ఫిజికల్ డైరెక్టర్, శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ శిష్యులు కావడం విశేషం. రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక విజయాలు సాధించి పలు పతకాలు ఓడిసిపట్టారు. మండలం నుంచి 13 మంది వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపిక కాగా, వీరిలో 11 మంది దేవరపల్లికి చెందిన వారు కావడం విశేషం. 6వ తరగతి నుంచి డీఎస్సీలో ఎంపికయ్యే వరకు వీరంతా రవీంద్రనాథ్ వద్ద నిరంతరం శిక్షణ పొందారు. గూడూరి శ్రీనివాస్, తంగెళ్ల మునేశ్వరరావు, కవల వెంకటలక్ష్మి, కవల పోసీరత్నం, కవల సుజాత, నిచ్చెనకోళ్ల ఓం ఫణి, కుక్కల వీర వెంకటసత్యనారాయణ, కండెల్లి చంటి, జక్కంశెట్టి శ్రీనివాస్, దువ్వపు అశోక్, కళ్లేపల్లి మాణిక్యం, తంగెళ్ల గంగాధరరావు, వనజ వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికై శిక్షణ అనంతరం ఉద్యోగాల్లో చేరారు. నూతన వ్యాయామ ఉపాధ్యాయులంతా రవీంద్రనాథ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా కారులంతా పేదకుటుంబాలకు చెందిన వారేనని, కష్టపడి చదివి, క్రీడా రంగంలో రాణించి ఉద్యోగాలు సంపాదించినట్టు ఆయన తెలిపారు.1994 నుంచి 2022 వరకు దేవరపల్లిలో వ్యాయామ ఉపాధ్యాయడిగా, ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేసి 674 మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది, అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినట్టు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లినా తన శిష్యులు ఉంటారని తనకు అదే ఆనందమని హర్షం వ్యక్తం చేశారు.

బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- స్త్రీ, సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి

సీటీఆర్ఐ: బాలికలు అన్ని రంగాల్లోనూ సమాన అవకాశాలు పొందుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ పీడీ టీ శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, విద్య అనే ఆయుధంతో ప్రతి బాలిక ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ, బాలికలు విద్యలో రాణించడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో ప్రతి రంగంలో ముందుకు సాగాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.ఎస్.జ్యోతి మాట్లాడుతూ, బాలికలు భద్రత, రక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారం మీద అవగాహన పెంపొందించు కోవాలన్నారు. సైబర్ క్రైమ్ సెల్ అధికారి వై.ఎస్.వి.సురేష్ బాబు మాట్లాడుతూ, స్మార్ట్‌ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని, సోషల్ మీడియాలో నిర్లక్ష్యం వల్ల సైబర్ క్రైమ్ ఘటనలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. సమాజంలో ధైర్యంగా ఉండాలన్నారు. బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి. శశాంక, డీఐఓ డాక్టర్ పి.కోమల, డీపీఎంఓ కె.శ్రీవల్లి, బాలికల చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎస్తేరు రాణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, సీడీపీవోలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి భారత విజ్ఞానమే మూలం

- ఎస్‌కేవీటీలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు
- ప్రాచీన శాస్త్రాలపై పలువురి ప్రసంగం
- హాజరైన జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా విద్యార్థులు



సావనీర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపాణ్యం తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రపంచానికి భారతదేశం అనేక విజ్ఞానాలను అందించిందని, నేడు ప్రపంచమంతా మన శాస్త్రాలను ఒప్పుకుంటున్నారని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపణ్యం అన్నారు. ప్రాచీన భారత జ్ఞాన పునర్జీవనం– ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి అనే అంశంపై రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాలలో రెండు రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన ఈ సదస్సులో ముందుగా కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ అంతర్జాతీయ సదస్సుని ప్రారంభించారు. ఈ సదస్సులో మొదటి రోజు జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా విద్యార్థులు పాల్గొని భారతదేశ జ్ఞాన సంపద గురించి ప్రముఖుల ప్రసంగాలను శ్రద్ధగా వినడమే కాకుండా ముఖ్యంశాలను రాసుకున్నారు.

సదస్సు ముఖ్య ఉద్దేశ్యం

ప్రాచీన కళలకు భారతదేశం పుట్టినిల్లు. ఈ పవిత్ర భారతదేశంలో ఎన్నో గ్రంథాలు, వేదాలు, శాస్త్రాలు రచించారు. నాట్యం, సంగీతం, చిత్రలేఖనం, జోతిష్యశాస్త్రం, ఖగోళశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, యోగా, ధ్యానం, ఆయుర్వేదం, వ్యవసాయం, తత్వశాస్త్రం, సాహిత్యం, కళలు వంటి ఎన్నో అద్భుత గ్రంథాలు వేల సంవత్సరాల పూర్వమే మనకి అందించారు. కానీ వాటిని వదిలి పాశ్చాత్య పైత్యం వైపు నేటి యువత పరుగులు తీస్తోంది. దీంతో ఒత్తిడితో అనేక శారీరక రుగ్మతలు ఏర్పడి చిన్న వయస్సులోనే తనువు చాలిస్తున్నారు. వీటన్నింటికి మూలం మన పూర్వీకులు చెప్పిన సూత్రాలను నేటి యువత పట్టించుకోకపోవడం. నేటి ప్రపంచం అనేక సంక్లిష్ట సమస్యలతో పోరాడుతోంది. వాతావరణ మార్పులు, మానసిక ఒత్తిడి, అస్థిరమైన జీవన శైలి, పర్యావరణ క్షీణత, సామాజిక అసమానతలు, ఆరోగ్య సంక్షోభాలు. ఈ సవాళ్లకు పరిష్కారాలు వెతుకుతున్న సమయంలో మన దృష్టి ప్రాచీన భారతీయ జ్ఞాన వ్యవస్థల వైపు తిరగడం అనివార్యమైంది. వేల సంవత్సరాల క్రితం అభివృద్ధి చెందిన ఈ జ్ఞానం కేవలం చారిత్రక ఆసక్తికి మాత్రమే పరిమితం కాకుండా, సమకాలీన ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందిస్తోంది. ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విభిన్న రంగ ప్రతిభావంతులు పాల్గొనుంటున్నారు. అనేక మంది పరిశోధకులు, విద్యార్థులు, అధ్యాపకులు, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులు తమ థీసిస్‌ని సమర్పించనున్నారు. మన పురాతన భారతీయ జ్ఞాన సంపద అనేది కేవలం గత వైభవం మాత్రమే కాదు, ఇది నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించగల శక్తివంతమైన సాధనంగా తెలియజేయడానికే ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు.

పూర్వీకుల విజయాలు

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ మన పురాతన భారతీయ జ్ఞాన సంపద అనేది కేవలం వైభవం మాత్రమే కాదని, నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాల అందించగల శక్తివంతమైన సాధనమని తెలిపారు. కీలక ఉపన్యాసం చేసిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ విశ్రాంత ఆచార్యులు డి.భాస్కరమూర్తి మాట్లాడుతూ వేదం ఉపనిషత్ యోగం, వాస్తు, వ్యవసాయం, గణితం, ఖగోళ శాస్త్రాలన్నీ మన పూర్వీకులు సాధించిన అసాధారణ విజయాలనీ, వాటిని ఈ రోజు కూడా అత్యంత కచ్చితత్వాన్ని నిరూపిస్తున్నాయని తెలిపారు. ప్రారంభ ఉపన్యాసం చేసిన కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి కృష్ణ మాట్లాడుతూ, భారతీయ విజ్ఞానం ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో మిళితమై భవిష్యత్తుకు మానవజాతికి ఓ చక్కని భవిష్యత్తుని అందివ్వ గలుగుతుందని అన్నారు. ప్రసిద్ధ నాటక కర్త వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ భారతీయ నాటక రంగం ప్రపంచానికి తలమానకమైందని, అభినయ దర్పణం, నాట్య శాస్త్రం లాంటి అద్భుతమైన గ్రంథాలు ప్రపంచానికి మార్గదర్శకంగా నిలిచాయని అని అన్నారు. ఈ సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్ చీమలమర్రి శ్రీనివాస్ శర్మ, ఆచార్య డి.కిరణ్ కాంత్ చౌదరి, ఆచార్య పసుమర్తి శ్రీనివాస్ శర్మ, ఆచార్య సి.స్వరూప రాణి, తదితరులు పరిశోధనాత్మక పత్రాలను చదివి వినిపించారు. ఈ సదస్సులో 225 మంది తమ గోష్టి పత్రాలను పంపించినట్టు కో కన్వీనర్ డాక్టర్ వై.స్వర్ణ శ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పీవీబీ సంజీవరావు, ఎల్ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ సత్యనారాయణ సాహూ, ఎ.శాంతరాజ్యం, డాక్టర్ డివి రమణమూర్తి, జి.శరత్‌బాబు పాల్గొన్నారు.



హాజరైన విదేశీ విద్యార్థులు

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

సీటీఆర్ఐ: ఏఐబీఈఏ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ప్రైవేటు బ్యాంకు ఉద్యోగుల సమస్యలకు మద్దతుగా మంగళవారం కరూర్ వైశ్య బ్యాంకు వద్ద తూర్పు గోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా బీఈఏసీ కార్యదర్శి లక్ష్మీపతి రావు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. సోమరాజు, మురళీధర్, స్వాతి, రమేష్, అప్పారావు, కిషోర్, రాంబాబు పాల్గొన్నారు.

